www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 డిసెంబర్ 2023
8 పేజీలు





ఏలూరు పశ్చిమ గోదావరి

కడసారి.. కన్నీటి వీడ్కోలు..!



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ముగిసిన ఎంఎల్‌సి సాబ్జీ అంత్యక్రియలు

భారీగా తరలొచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు

తరలొచ్చిన ప్రజాప్రతినిధులు, సంఘాల నేతలు


కలెక్టర్, జెసి, ఎస్‌పి, ఆర్‌డిఒ నివాళులు

ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా అంతిమయాత్ర



నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

'ఎప్పుడు కలిసినా ఆప్యాయంగా పలుకరించేవారు. ఏ కష్టం ఉందన్నా వెంటనే స్పందించేవారు.. ముందురోజు మాట్లాడాను.. ఆ ఉదయమే కలిశాను.. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది' అంటూ తమ ఉద్యమనేత ఎంఎల్‌సి షేక్ సాబ్జీ భౌతికకాయాన్ని కడసారి చూసిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గమంతా కన్నీరుమున్నీరైంది. ఆదివారం ఏలూరులో సాబ్జీ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా ముగిశాయి. ఆయన్ని కడసారి చూసేందుకు ఉద్యోగ, కార్మిక, కర్షకులతోపాటు ఎంపీ, ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు, అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు, ఇతర జిల్లాల నుంచి సైతం తరలొచ్చి నివాళులర్పించారు. తమ నేత భౌతికకాయాన్ని, కుటుంబసభ్యుల రోదన చూసి అంతా కన్నీరుమున్నీరయ్యారు.




సాబ్జీ అంతిమయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్, టౌన్


యుటిఎఫ్ ముద్దుబిడ్డ, ఉద్యమ నేత ఎంఎల్‌సి షేక్ సాబ్జీ (57) అంత్యక్రియలు ఆదివారం ఏలూరులో ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా జరిగాయి. తమ నేతకు కడసారి వీడ్కోలు చెబుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గమంతా అంతా కన్నీరుమున్నీరైంది. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌ఎ కొఠారు అబ్బాయిచౌదరి, ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, కల్పలతారెడ్డి, మాజీ ఎంఎల్‌సి వి.సుబ్రమణ్యం, మేయర్ షేక్ నూర్జహన్, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, మాజీ మంత్రి, టిడిపి నాయకులు కెఎస్.జవహర్, జిల్లా, ఇతర జిల్లాల ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు, జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జెసి లావణ్యవేణి, ఎస్‌పి మేరీప్రశాంతి, ఆర్‌డిఒ ఖాజావలీతోపాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు పెద్దఎత్తున తరలొచ్చి సాబ్జీ భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముస్లిం సంప్రదాయ పద్ధతిలో సాబ్జీ అంత్యక్రియలు సాగాయి. ఉదయం తొమ్మిది గంటలకు ఆశ్రం ఆసుపత్రి నుంచి సాబ్జీ భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో 6లో..




కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ నివాళి..



ఎంఎల్‌ఎలు ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి నివాళి..



ఓదారుస్తున్న నగర మేయర్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

నిర్వాసితులపై బిజెపి వైఖరి వెల్లడించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం నిర్వాసితుల పునరావాసంపై బిజెపి వైఖరి వెల్లడించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఎ.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి పోలవరం పునరావాసంపై మాట దాటవేశారని విమర్శించారు. కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్రప్రభుత్వం మేసేస్తుంటే మీ ప్రభుత్వం గుడ్డిగుర్రం పళ్లు తోముతోందా అని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి దమ్ముంటే తీవ్రవిమర్శలు చేసే బదులు సమగ్ర విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిధులు కూడా స్వాహా చేస్తున్నారని మాట్లాడిన పురంధరేశ్వరి నిర్వాసితుల పునరావాసం గురించి ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని విభజన హామీల్లో అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపు, నిర్మాణ పర్యవేక్షణను గాలికొదిలేసిందని విమర్శించారు. నిర్వాసితుల పునరావాసంపై తమకు బాధ్యత లేదని కేంద్రమంత్రి పార్లమెంటులో స్వయనా ప్రకటించడం బిజెపి ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు, ప్రతి విమర్శలు తప్ప బిజెపి రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే పునరావాసంపై కేంద్రం వైఖరిని ప్రకటించాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, నేతలు జోడే సూర్యచంద్రరావు, జి.సూర్యకిరణ్, బొడ్డు రాంబాబు, యాగంటి సీత తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డలపై కనికరం లేదా..!

లబ్ధిదారులు, పిల్లలతో కలిసి

ఆరో రోజు అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకోసం అనేక రూపాల్లో నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. చివరకూ లబ్ధిదారులు, పిల్లులు సైతం నిరసన తెలుపుతున్నా చలించడం లేదు. దీనికితోడు అంగన్‌వాడీ కేంద్రాలను ఇతరులతో తెరిపించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటు. తమను ఏం చేద్దామని ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని అంగన్‌వాడీలంతా ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సమ్మె ఐదో రోజు ఆదివారం ఉధృతంగా సాగింది. వినూత్న రీతిలో నిరసన తెలుపుతూ.. వెనక్కి తగ్గేది లేదుంటూ విధులు బహిష్కరించి అంగన్‌వాడీలంతా సమ్మెలో పాల్గొంటున్నారు. 8లో..



ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో తమ బిడ్డలతో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

నామినేషన్ల చివరి తేదీ వరకూ ఓటర్ల నమోదు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

వచ్చే జనవరి 5న ఓటర్ల తుదిజాబితా ప్రకటించినప్పటికీ నామినేషన్ల చివరి తేదీ వరకూ ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వీటిని సప్లిమెంట్ ఓటర్ల జాబితా కింద ప్రకటిస్తారని తెలిపారు. విజయవాడలో ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా ఎస్‌పిలతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల నిర్వహణ అంశాలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమావేశం నిర్వహించనుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల నిర్వహణ కోసం ఏలూరు జిల్లా 6లో..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

అంగన్‌వాడీలకు లబ్ధిదారుల సంఘీభావం



మండపేటలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు, లబ్ధిదారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

అంగన్వాడీలు డిమాండ్ల సాధనకు కోసం చేస్తున్న అంగన్‌వాడీల సమ్మె ఆదివారం ఆరోరోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు వచ్చే లబ్ధిదారులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు వారి సమ్మెకు మద్దతు తెలిపాయజేశారు.

మండపేట తమ డిమాండ్ల సాధనే లక్ష్యంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసరాల ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనం, పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ఆయాలకు ప్రమోషన్ వయస్సు 50 సంవత్సరాలకు పెంచాలని తదితర అంశాలపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇస్తానన్న సిఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమ్మెకు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండపేట ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.బేబీ, ఆదిలక్ష్మి, సిహెచ్.రాణి, మంగాదేవి, జానకి, అనంత, దేవకి, దుర్గా, వజ్రం, కుమారి, నాగలక్ష్మి, కమల, సత్యవేణి, పద్మ, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం అంగన్ వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన దీక్షలు 6వ రోజైన ఆదివారం పిల్లల తల్లులు దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద దీక్షల్లో పిల్లల తల్లులు పాల్గొని అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకు అంగన్‌వాడీలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు దుర్గా మహేశ్వరి కార్యదర్శి జయలక్ష్మి, ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు తలుపులమ్మ, సుభాషిణి, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, విజయ, అనంత లక్ష్మీ, రమాదేవి, అరుణ పలువురు అంగన్ వాడీ కార్యకర్తలు మరియు సహాయకులు పాల్గొన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు బిఎస్‌పి నాయకులు మద్దతు తెలిపారు.

రామచంద్రపురం అంగన్‌వాడీల సమ్మెకు ప్రీస్కూల్ పిల్లలతో సహా వారి తల్లిదండ్రులు పాల్గొని సంఘీభావం తెలిపారు .సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగనవాడి జిల్లా కార్యదర్శి ఎం .దుర్గ, వి. వీరలక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. రామచంద్రపురం, కె.గంగవరంమండలాల అంగన్‌వాడీలు, లబ్దిదారులు, ప్రీ స్కూల్ పిల్లలులి పెద్ద సమ్మె శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. సమ్మెలో అంగనవాడి జిల్లా సభ్యులు వాసంశెట్టి సూర్యకుమారి, మండల అధ్యక్షులు కె.విజయలక్ష్మి, జి.శ్రీదేవి, సెక్టార్ లీడర్స్ జహీరా, కె.దుర్గ, జి.వెంకటరత్నం. గోంతి దేవి, వీర వేణి, సత్యవతి, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

మామిడికుదురు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని చేస్సున్న సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరుకుంది. అంగన్ వాడీ పిల్లలతో వారి తల్లితండ్రులు ఆదివారం సమ్మ్మె మద్దత్తు తెలిపారు.

అమలాపురం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెను ఆదివారం 6వరోజు కొనసాగింది. ఈ సందర్భంగా అమలాపురం సిడిపిఒ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో టిడిఎస్‌సి నాయకులు రేవు తిరుపతిరావు పాల్గొని అంగన్‌వాడీలకు తమ సంఘీభావం తెలిపారు. తమ న్యాయమైన కోరికలు సాధనలో భాగంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అన్నారు. సమ్మెలో పి. అమూల్య, విజయ, రత్నకుమారి, మణిమాల, దైవకప, బేబీ గంగ రత్నం, ఐసిడిఎస్ ప్రాజెక్టుకు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఐ.పోలవరం నాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో ఉన్న 504మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో ఆయా మండలాలు పరిధిలో ఉన్న 250అంగన్ వాడీ కేంద్రాలు ఇప్పటికే మూతపడ్డాయి.



ముమ్మిడివరంలో అంగన్ వాడీలకు మద్దతుగా పిల్లల తల్లులు నిరసన ర్యాలీ



రామచంద్రపురంలో ఆరో రోజు సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ చిన్నారుల తల్లిదండ్రులు



అమలాపురంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం



సమాన పనికి సమాన వేతనం ప్రకారం రూ.25వేలు ఇవ్వాలని సుప్రీం చెబుతున్నా, ప్రభుత్వం స్పదించకపోవడం అన్యాయం. పైగా వేతనాలు పెంచమని అడిగితే బెదిరింపులకు దిగడం శోచనీయం.

-ఎం.జయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్ల,హెల్పర్ల ప్రాజెక్ట్ కార్యదర్శి, ముమ్మిడివరం నియోజకవరం

సమ్మె ఆగదు.. పోరాటం ఆగదు..



సర్కారు ఎన్ని కుట్రలు చేసినా బెదిరింపులకు పాల్పడినా మేం సమ్మె ఆపేది లేదు. పోరాటం నిలిపేదిలేదు.మరింత ఉదతంగా సమ్మెను కొనసాగిస్తాం. అంగన్‌వాడల హక్కులను సాధించుకుని తీరుతాం.

-కె.నాగ లక్ష్మి, సిఐటియు మండల సెక్రటరీ, ఐ.పోలవరం

అంగన్‌వాడీ వర్కర్‌గా 24 ఏళులగా పని చేస్తున్నా



అంగన్ వాడీ వర్కర్ గా 24ఏళ్లగా పని చేస్తున్నా. ఎన్నో పోరాటాలు ఫలితంగా నేడు రూ.11,500కు చేరింది. నిత్యావసరాల ధరలు చూస్తే వచ్చే జీతం ఏ మూలకు సరిపోవటం లేదు.

-ఎ వెంకట రత్నం, అంగన్‌వాడీ వర్కర్ , ఐ.పోలవరం

యువగళం ముగింపు సభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి రామచంద్రపురం

యువ గళం ముగింపు సభను విజయవంతం చేయాలని టిడిపి ఇంఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 20న జరిగే యువగళం ముగింపు సభకు నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది హాజరవ్వాలన్నారు. జాతీయ పార్టీ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ముగుస్తున్న సందర్భంగా విజయ నగరం జిల్లా భోగాపురం మండలం పోలపల్లిలో ఈ నెల 20న బహిరంగ సభ జరగనుం దన్నారు. సభకు టిడిపి శ్రేణులు తరలి వెళ్లి విజయవ ంతం చేయాలన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ రిజిస్ట్రేషన్లు ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నియోజ కవర్గ టిడిపి పరిశీలకులు కాకినాడ రామారావు, పార్టీ మం డల, పట్టణ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జ్ లు, టిడిపి గ్రామఅధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడరన్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్‌కు 1269 మంది హాజరు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ కళాశాల్లో ఆదివారం నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌కు 1269 మంది విద్యార్థులు హాజరయ్యారు. టెన్త్ చదువుతున్న విద్యార్థులకు మోడరన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోఆదివారం నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌కి విశేష స్పందన లభించిందని మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ స్కూళ్ళకు సంబందించిన 1269 విద్యార్థులు మోడరన్ స్టార్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో పాల్గొన్నారని అన్నారు. ప్రతి ఏటా దీనిని నిర్వహిస్తున్నామని వివరించారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్ మాట్లాడుతూ ఫలితాలు త్వరలో ప్రకటించి విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తామన్నారు. స్కాలర్షిప్ టెస్ట్ సజావుగా నిర్వహించిన సిబ్బందిని రావు అభినందించారు.

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లో ఈ నెల 18న సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన జగనన్నకు చెబుదాం కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పామర్రులో శ్మశానం అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం పామర్రు గ్రామంలో రూ.25 లక్షలు ఎంపీ నిధులతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు వైసిపి నాయకులు పిల్లి సూర్య ప్రకాష్ ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ శ్మశాన అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. ఎంతోకాలంగా పామర్రు గ్రామంలో శ్మశానం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అభివద్ధి పనుల్లో భాగంగా ఇక్కడ షెడ్డు నిర్మాణం పూర్తి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, శెట్టిబలిజ సంఘం మండల అధ్యక్షులు శ్యాంప్రసాద్, ఆముజూరు వైసిపి నాయకులు నానావరపు శ్రీనివాస్ పామర్రు గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వే బోర్డు కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా రాంబాబు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వెలంపాలెం గ్రామానికి చెందిన పెయ్యల రాంబాబుకు రైల్వే బోర్డు కన్సల్టేటివ్ సభ్యునిగా నియమిస్తూ దక్షిణమధ్య రైల్వే అసిస్టెంట్ కమిషనర్ సంజయ్ మనోజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న పెయ్యిల రాంబాబు మాట్లాడుతూ నన్ను గుర్తించి నామినేట్ చేసి నా నియమానికి సహకరించిన రైల్వే కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయాజివేమా, జిల్లా అధ్యక్షులు యళ్ల దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 23వ తేదీ శనివారం యాత్రికులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ఇఒ సత్యనారాయణ రాజు ఆదివారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర ద్వార దర్శనం తెల్లవారు జామున 4 గంటల నుంచి యాత్రికులకు దర్శనాలు కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ క్షేత్రానికి గల విశిష్టత, రద్దీని దృష్టిలో ఉంచుకుని రూ.50 ప్రత్యేక దర్శనాన్ని పూర్తిగా రద్దుచేశామన్నారు. సాధారణ భక్తులకు దర్శనాలకే అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఉచిత దర్శనంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దశలవారీగా గ్రామంలో రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

భీమనపల్లి పంచాయతీ పరిధిలో రోడ్ల నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ శంకుస్థాపనలు చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో రూ.7.70లక్షలతో భీమనపల్లి, సూదాపాలెం గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ రాజ్ కుమార్ శంకుస్థాపన చేశారు. దశలవారీగా గ్రామంలో అవసరం ఉన్న చోట సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచ్ రాజ్ కుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు సత్య కృష్ణ,రమేష్,గ్రామస్తులు పాల్గొన్నారు.



డ్రైన్ నిర్మాణానికీ భూమిపూజ చేస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

గ్రామాల అభివృద్ధికి సిఎం జగన్ కృషి

ప్రజాశక్తి-అయినవిల్లి

గ్రామాల అభివృద్ధికి సిఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. పోతుకుర్రు గ్రామం రామాలయం వీధిలో రూ.6 లక్షలతో డ్రైన్ నిర్మాణ పనులకు ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సయ్యపురాజు సుబ్బలక్ష్మి, వైసిపి గ్రామ శాఖ అధ్యక్షుడు కమిడి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్, వాసంశెట్టి పుల్లం శెట్టి, మార్కెట్ కమిటి ఛైర్మన్ వేటుకూరు వెంకటరాజు, సొసైటీ ఛైర్మన్ చీలువురి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల నిర్బంధం

ప్రజాశక్తి-మామిడికుదురు

పెదపట్నంలంకలో ఆదివారం అపరిచిత వ్యక్తులను జనసేన శ్రేణులు నిర్భందించారు. ఓటర్ల జాబితాలతో వివరాలు సేకరిస్తుండటంతో ఎంపిటిసి సభ్యుడు కొమ్ముల జంగమయ్య, జనసైనికులు వారిని అడ్డుకున్నారు. అపరిచితులు హైదరాబాద్, ఖమ్మం, రాయలసీమ వాసులుని జనసేన శ్రేణులు పేర్కొన్నారు. వారిని పోలీసులకు అప్పగిస్తా మన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి భవాని తదితరులు

అథ్లెటిక్స్ పోటీల ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని ఎస్‌కెపిజిఎన్ క్రీడాప్రాంగణంలో నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చీఫ్ కోచ్ ప్రసాద్ రెడ్డి సెక్రటరీ రవితేజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పోటీలు ప్రారంభించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొనగా 13 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.ముఖ్య అతిథులుగా డాక్టర్ స్టాలిన్, గన్నమనేని చక్రవర్తి, ఛైర్మెన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపిపి మండల అంబటి భవాని తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా 'రాయల్ క్లబ్'

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహించడంలో రాయల్ క్లబ్ ఎప్పుడు అండగా ఉంటుందని, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రిటైర్డ్ జాయింట్ కమిషనర్ సీతాలాం రాంబాబు స్పష్టం చేశారు. మండలంలోని భైరవపట్నం శుభం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన రాయల్ క్లబ్ కైకలూరు విద్యార్థుల స్కాలర్‌షిప్ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును ముందుకు తీసుకు వెళ్లే విధంగా ప్రతిభ గల విద్యార్థులను రాయల్ క్లబ్ ఆఫ్ కైకలూరు ప్రోత్సహిస్తూ ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి కార్యక్రమాలతో పాటు మెడికల్ క్యాంపులు, అన్నదానాలు, వరద బాధితులను ఆదుకోవడం వంటి పలు సేవా కార్యక్రమాలను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున లక్షా ఇరవై వేల రూపాయలను అందించారు. అనంతరం పదో తరగతి పాసై ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ, బిటెక్ కోర్సులలో చదువుతున్న, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాయల్ సర్వీసెస్ ట్రస్ట్ ఛైర్మన్ పేటేటి పుల్లయ్య, కోశాధికారి గాజుల రామారావు, నేషనల్ రాయల్ క్లబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుంకర కృష్ణ, రాయల్ క్లబ్ కైకలూరు అధ్యక్షులు ప్రొఫెసర్ సుధా, బత్తుల విజయకుమార్ పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

'ఉపాధి భద్రతతో కూడిన చట్టం చేయాలి'


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన చట్టం చేయాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రమణ, బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు అనుబంధ ఏలూరు జట్టు కార్మిక సంఘం 19వ వార్షిక సభ స్థానిక వైఎంహెచ్‌ఎ హాల్ వద్ద ఆదివారం సంఘం అధ్యక్షులు జగ్గరపు రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో రమణ, వెంకట్రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రమారమీగా నాలుగు కోట్ల మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని, వారికి పని భద్రతతో కూడిన చట్టం చేయాల్సిన బాధ్యత మోడీ ప్రభుత్వం మీద ఉందన్నారు. కానీ బిజెపి ప్రభుత్వం పది సంవత్సరాలు దేశంలో అధికారంలో ఉండి కూడా హమాలీ కార్మికులను పట్టించుకోకపోవటం సిగ్గుచేటు అని విమర్శించారు. అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సభకు ఐఎఫ్‌టియు నగర అధ్యక్ష, కార్యదర్శులు కాకర్ల అప్పారావు, యర్రా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డప్ప నాయుడు, పిడిఎస్‌యు జిల్లా ప్రెసిడెంట్ కాకి నాని, క్రాంతి, సంఘం నాయకులు మంగం అప్పారావు హాజరైయ్యారు.

చెరువుల ఆక్రమణపై వినతి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు గ్రామంలో చెరువులన్నీ ఆక్రమణకు గురయ్యాయని గ్రామస్తులు తహశీల్దార్‌కి వినతిని అందజేశారు. ఆదివారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన మానిక్యాల సాంబశివరావు పలువురు గ్రామస్తులతో కలిసి గ్రామంలోని చెరువులన్నీ ఆక్రమణకు గురైయ్యాయని జిల్లా కలెక్టర్‌కు తెలిపి, చెరువులను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని తహశీల్దార్‌ను కోరారు.


తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న గ్రామస్తులు

విశ్రాంత వైద్యుడు ఆదిరెడ్డి మృతి



ప్రజాశక్తి - ఉంగుటూరు

లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత వైద్యులు గోపు ఆదిరెడ్డి(86) ఆదివారం తెల్లవారు జామున హైదరాబాదు ఆసుపత్రిలో మరణించారు. ఆదిరెడ్డి ఉంగుటూరులో ఆయుర్వేద వైద్యునిగా, చేబ్రోలులో అల్లోపతి వైద్యునిగా దాదాపు అర్ధ శతాబ్దం పాటు లక్షలాది మందికి సేవలు అందించారు. ఆయన నాడి పట్టుకుంటే చాలు వ్యాధి నయం అయిపోతుందనేలా ప్రజలు విశ్వాసాన్ని చూరగొన్నారు. వైద్య వృత్తితో పాటు సమాజ సేవా కార్యక్రమాలపై ఆయన దృష్టి సారించి లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు ఏర్పాటులో ఆదిరెడ్డి కీలకంగా వ్యవహరించి అధ్యక్షునిగా అనేక సేవాకార్యక్రమాలు చేశారు. నారాయణపురంలో లయన్స్ క్లబ్ ఆడిటోరియం నిర్మాణానికి ఉచిత భూమిని సేకరించి శాశ్వత భవనం నిర్మాణంలో ఆయనే కీలకంగా వ్యవహరించారు. అప్పటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఎంపీ బోళ్ల బుల్లిరామయ్యలతో భవనాన్ని ప్రారంభింపజేశారు. ఉంగుటూరు మండలంలో లయన్స్ సేవలను విస్తరించడంలో గోపు ఆదిరెడ్డే ప్రేరణ అని ఆయన సేవలు ఎన్నటికీ చరిత్రలో మిగిలే ఉంటాయని వయోవృద్ధుల సంక్షేమ సంఘం అఖిల భారత కార్యదర్శి వెంపరాల నారాయణమూర్తి, మానవత నాయకులు గుణ్ణం బుల్లెబ్బాయిలు తెలిపారు. ఈనెల 18న నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఆదిరెడ్డికి సంతాప సభ నిర్వహించనున్నామని బుల్లెబ్బాయి వెల్లడించారు.

ఘనంగా పోలీస్ బలగాల సెమీ క్రిస్మస్

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక పోలీస్ బలగాల సెమీ క్రిస్టమస్ వేడుకలు ఆదివారం పోలవరం ప్రాజెక్టు పోలీస్ బ్యారక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎస్‌పి ఆర్ఐ ఎ.విజయ్ కుమార్ మాట్లాడుతూ మానవత్వాన్ని మించిన దైవత్వం లేదన్నారు. కేక్ కట్ చేసి సెమీ క్రిస్టమస్ వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకలో హెడ్ కానిస్టేబుల్స్ ఆనంద్ కుమార్, పంతాడ రాజశేఖర్, ఎం.కళ్యాణ్ కుమార్, సిబ్బంది సిహెచ్.చిన్ని బాబు, దేవేంద్రుడు, సుమంత్ పాల్గొన్నారు.

'టిడిపితోనే బిసిలకు న్యాయం'

ప్రజాశక్తి - కలిదిండి

టిడిపి అధికారంలోకి రాగానే బిసిల రక్షణ చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో బాబు ష్యూరిటీ - భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. జగన్ ప్రభుత్వం 56 బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నాలుగున్నర ఏళ్లు కావస్తున్నా, ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకుండా కాలక్షేపం చేశారన్నారు. టిడిపితోనే బిసిల అభ్యున్నతి సాధ్యమని అంద్రాజు అన్నారు. టిడిపికి మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోకా వెంకట రమణ, ఎ.దుర్గా ప్రసాద్, పరమేశ్వరరావు పాల్గొన్నారు.


మట్టగుంటలో ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

మార్టేరులో కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరులో కుక్కల బెడద ఎక్కువగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. తెల్లవారుజామున లేచి బయటకు వాకింగ్‌కి వెళ్లి రావడానికి ముఖ్యంగా వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఒక వీధిలో పదుల సంఖ్యలో కుక్కలు సంచారం చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా తాడేపల్లిగూడెం రోడ్డులో కుక్కలు బయట తెల్లవారుజామున తిరుగుతుంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటకు రావల్సి ఉందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు


గాయపడిన ధనలక్ష్మి

వితంతువుపై కత్తితో దాడి

ఆపై పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలులో ఆదివారం పొలంలో వరినాట్లు వేస్తున్న వితంతువు ధనలక్ష్మిపై భీమయ్య అనే వ్యక్తి కత్తితో దాడి చేసి, తరువాత అతను కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నారాయణపురం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన ధనలక్ష్మి భర్త చనిపోయాడు. కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన బోడిగడ్ల భీమయ్యకు భార్య లేదు. దీంతో ఇరువురు కొంత కాలం నుంచి సన్నిహితంగా ఉంటున్నారు. దరిమిలా వారిద్దరి మధ్య ఏవో మనస్పర్థలు వచ్చినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ధనలక్ష్మి చేబ్రోలులో పొలం పనులు చేస్తుండగా కత్తితో దాడి చేసి, వెంట తెచ్చుకున్న పురుగుల మందును భీమయ్య తాగేశాడు. దీంతో ఇద్దరినీ 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగానే ఉన్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ వెల్లడించారు.


మృతి చెందిన వ్యక్తి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. గుండుగొలను నుంచి కొవ్వూరు వైపు వెళుతున్న మోటారుసైకిలిస్టును ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో మోటార్ సైకిలిస్ట్ ఘటనాస్థలిలో మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తి భీమడోలు మండలం గుండుగొలను గ్రామ వాసిగా భావిస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.


ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలి


మాజీ ఎంఎల్‌ఎ చిన్నం రామకోటయ్య


ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి, ముసునూరు, నూజివీడు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, మండలాలకు తాగునీరు, సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అప్పటి సిఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి కాకపోవడానికి లోకల్ రాజకీయ నాయకులు, ఎంఎల్‌ఎలు కారణమని మాజీ ఎంఎల్‌ఎ, ఇండిపెండెంట్ అభ్యర్థి చిన్నం రామకోటయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చాట్రాయిలో ఆదివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎటువంటి అభివృద్ధి కనిపించటం లేదని, ఏండ్ల తరబడి చేయాల్సిన పనులు పూర్తి కాకుండా పడి ఉన్నాయన్నారు. ఈనెల 21న జగనన్నకు గుర్తుచేద్దాం కార్యక్రమంలో భాగంగా నరసింహారావు పాలెం నుంచి చీపురుగూడెం వరకు చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేస్-2 పనులను పరిశీలిస్తామని, ఆక్రమంలో రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి మాజీ సర్పంచి కోటా జోషి, చిన్నంపేట మాజీ ఎంపిటిసి రమేష్, చీపురు గూడెం ఎంపిటిసి మేకల చందు పాల్గొన్నారు.


రామకోటయ్యకు మద్దతు తెలుపుతున్న సర్పంచి జోషి


నివాళులర్పిస్తున్న సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి


నివాళులర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర నేత వి.ఉమామహేశ్వరరావు


యుటిఎఫ్ జెండాను కప్పుతున్న ఎంఎల్‌సి ఐవి

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

ముగిసిన ఎంఎల్‌సి సాబ్జీ అంత్యక్రియలు - ప్రముఖుల ఘన నివాళి - ప్రభుత్వలాంఛనాలతో నిర్వహణ




గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

మూగబోయిన ఉద్యమాల గొంతు..

పల్లవి : ఉపాధ్యాయ ఉద్యమాల గొంతు మూగబోయిందా
కాలం కసిగట్టి కారుచీకటిని నింపిందా
నమ్మలేకపోతున్నాం మా సాబ్జి లేరని
కంట నీరు జడి వానై కడలై పొంగింది

చరణం : ప్రతి అడుగు సాహసమే నీ జీవిత ప్రస్థానం
పట్టుదల పతాకమై సాగెను నీ పయనం
ఉపాధ్యాయ ఉద్యమాల ఊపిరి నీవై
చివరి వరకు నిలిచావు పోరాట చిరునామై

చరణం : కష్టజీవులందరికి పక్షపాతి నీవయ్యావు
కార్మిక కర్షక హక్కుల దిక్సూచిగ నిలిచావు
శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకై
నిన్ను వరించిన పదవికి వన్నె తెచ్చినావు

చరణం : నిలువెత్తు ఆదర్శమే నీ రూపమైంది
మహోన్నతపు ఆశయమే నీ బాటగా సాగింది
మంచితనం మానవతకు మారుపేరుగా నిలిచి
చెరిగిపోని జ్ఞాపకమై మా మదిలో నిలిచావు

చరణం : ఉద్యమ వీరులకు ఉండబోదు మరణం
ఎగురుతున్న జెండాలో మీ రక్తమే అరుణం
బిగించిన ప్రతి పిడికిలి మీ స్ఫూర్తిని చాటుతుంది
మీ ఆశయ బాటలో కడవరకు పోరుతుంది

-పి.మంగరాజు
ప్రజానాట్యమండలి



తరలొచ్చిన ఉపాధ్యాయ లోకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

యుటిఎఫ్ ముద్దుబిడ్డ, ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అంతిమయాత్రను యుటిఎఫ్ నాయకత్వం ముందుండి నడిపించింది. తొలుత యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ సాబ్జీ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ప్రజల సందర్శనార్థం ఇండోర్ స్టేడియంకు తరలించారు అక్కడ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, ఆర్.రవికుమార్ అన్ని కార్యక్రమాలు దగ్గరుండి పర్యవేక్షించారు. సాబ్జి అంతిమయాత్రలో పాల్గొనేందుకు రాష్ట్ర నాయకత్వంతో పాటు వివిధ జిల్లాల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా నాయకులు తరలొచ్చారు. అంతిమయాత్ర అనంతరం జరిగిన సంతాప సభలో వారంతా పాల్గొని సాబ్జితో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాబ్జీ అంతిమయాత్రలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, నేతలు పివి. నర్సింహరావు, పి.కనకదుర్గ, సిహెచ్.శ్రీదేవి, కొమ్మోజు శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, బి.లక్ష్మీరాజా, ఎన్.అరుణకుమారి, ఎస్‌పి.మనోహర్‌కుమార్, వి.బాలసుబ్రహ్మణ్యం, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, నేతలు పి.క్రాంతి, తూర్పుగోదావరి జిల్లా నేత పి.జయకర్, పూర్వ యుటిఎఫ్ నేతలు, వివిధ జిల్లాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

సాబ్జీ ఆశయ సాధనే ఘననివాళి

ప్రజాశక్తి - వీరవాసరం

ఎంఎల్‌సి సాబ్జీ ఆశయ సాధనే మనం వారికిచ్చే ఘనమైన నివాళి అని రాష్ట్ర నాయకులు జివివి. రామానుజరావు అన్నారు. సాబ్జీ సంతాప సభ ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నేతలు తొలుత సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబ్జీ ఉపాధ్యాయ రంగానికి చేసిన సేవలు, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.కుమార్‌బాబ్జీ, మండల ప్రధాన కార్యదర్శి ముద్రగళ శ్రీనివాస్, నేతలు డి.పుల్లారావు, ఎన్.ప్రసాదుబాబు, పి.సాయిబాబు, ఎ.గోవిందరాజులు, గుబ్బల శ్రీలక్ష్మీ, కె.రామకృష్ణ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నేతలు


సాబ్జీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఉద్యమ సారధి లేకపోవడం తీరనిలోటు - యుటిఎఫ్, ప్రజాసంఘాల సంతాప సభలో వక్తలు


మాట్లాడుతున్న ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు


ప్రజాశక్తి - ఏలూరు టౌన్


ప్రజల పక్షాన నిలిచే వ్యక్తి, అన్యాయంపై గొంతెత్తి పోరాడే వ్యక్తి మరణిస్తే.. అది సమాజానికి నష్టమని.. కార్మిక, కర్షక వర్గాలకు, ఉద్యమకారులకు తీరనిలోటని, ఎంఎల్‌సి సాబ్జి వంటి గొప్ప ఉద్యమకారుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన ఆశయసాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి సంతాప సభ యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏలూరు కెనాల్ రోడ్డులో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగింది. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్, కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య పాల్గొని ప్రసంగించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక ఉద్యమాల్లో పాల్గొన్న సాబ్జీ దేశంలో పిల్లలు చదువుకోవాలని, దేశ పరిరక్షణ, పీడిత, కార్మిక, కర్షక, ఉద్యోగులు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా ఎపి విద్యారంగంలో అభివృద్ధి సాధించేలా కృషి చేయాలన్నారు. సాబ్జీ అకాల మరణం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమకారులను, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులను తీవ్ర విషాదంలో నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్ల ఉద్యమాల ద్వారా ఒక ఉద్యమ కెరటాన్ని తయారు చేసుకోగలిగామని, ఇప్పుడు ఆయన లేని లోటు పూడ్చుకోలేనిదని అన్నారు. పిడిఎఫ్ తరపున ముగ్గురు ఎంఎల్‌సిలు ఉండేవారని, సాబ్జీ మరణంతో అది రెండుకు చేరిందన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిల సంఖ్య రోజురోజుకీ తగ్గడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ సమాజంలో ప్రశ్నించేవారు ఎక్కడున్నారని, ఒకవేళ ఎవరైనా ప్రశ్నించినా అది వారి అవసరాల కోసమేనని.. సమాజం కోసం ప్రశ్నించే సాబ్జీలాంటి వారు అరుదుగా ఉంటారన్నారు. సాబ్జీకి జరిగిన ప్రమాద దశ్యం..శత్రువుకి కూడా కంట తడిపెట్టించేలా ఉందన్నారు. ఉద్యమంలో సాబ్జీ ఒక సంచలనమని, ఆయన మరణం తీరని లోటని విషణ్ణవదనలతో తెలిపారు. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ సాబ్జి మరణం యావత్ ఉపాధ్యాయ వర్గాలకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఒక పోరాట యోధుడిని కోల్పోయామని, శాసనమండలిలో ప్రజా, ఉద్యోగ సమస్యలపై నిర్భయంగా, నిస్సంకోచంగా, నిక్కచ్చిగా మాట్లాడే మహానీయుడిని మళ్లీ చూడలేమన్నారు. సాబ్జీ ప్రజా పోరాటాల్లోనే తనువు చాలించారని, అంగన్వాడీ ఉద్యమాలకు మద్దతుగా నిలుస్తూ వస్తున్న క్రమంలోనే ఊపిరొదలడం ద్వారా తాను ప్రజా ఉద్యమ నేతనని మరోసారి నిరూపించారన్నారు. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయ సాధన కోసం మనమంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సాబ్జీ అమెరికా వెళ్లిన సందర్భాలు మినహా మిగిలిన సమయమంతా ఉద్యమాల్లోనే గడిపారన్నారు. పోరాడేవారికి ఎర్రజెండా తోడు.. ఉద్యమకారుడికి ఉద్యమమే అజెండా అని సాబ్జి చెప్పేవారన్నారు. ఉద్యమాలను ప్రభుత్వం అణగదొక్కుతున్న సమయంలో గొప్ప ఉద్యమ నేతను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేళ సాబ్జి వంటి గొప్ప నేతను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి కల్పలతారెడ్డి


యుటిఎఫ్ రాష్ట్ర నేతలు ప్రసాద్, వెంకటేశ్వర్లు, బాబురెడ్డి




నివాళులర్పిస్తున్న రావి గోపాలకృష్ణయ్య



నివాళులర్పిస్తున్న అంగన్వాడీ రాష్ట్ర నేత బేబిరాణి


ముస్లిం సోదరుల నివాళి



జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి నివాళి


మేయర్ నూర్జహన్ పెదబాబు నివాళి


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి


నివాళులర్పిస్తున్న జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు


నివాళులర్పిస్తున్న ఆశా వర్కర్ల రాష్ట్ర నేతలు


నివాళులర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర నేత సిహెచ్.నర్సింగరావు




మాట్లాడుతున్న ఐ.రాజగోపాల్

సాబ్జీ మృతి ఉద్యమాలకు తీరనిలోటు : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - తణుకురూరల్

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అకాల మరణం బాధాకరమని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ అన్నారు. ఆదివారం (ఎపిటిఎఫ్) తణుకు మండలశాఖ సమావేశం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తొలుత షేక్ సాబ్జి మరణం పట్ల సమావేశం నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారిన జిఒ నెం.117ను తక్షణమే రద్దు చేసి పాఠశాల విలీనాన్ని ఆపాలన్నారు. ఖాళీగా ఉన్న 40 వేల టీచర్ పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని, 2023 జూలై నుండి ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ ఉపాధ్యాయులు ఎ.వీరభద్రరావు, జిల్లా కార్యదర్శి వి రామ్మోహన్, తణుకు మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ జయరాజు పాల్గొన్నారు.





నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

సాబ్జీ అకాల మరణం బాధాకరం : ఐద్వా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ ఉద్యమనేత, ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అకాల మరణం తీరని లోటు అని ఐద్వా నేతలు తెలిపారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక అన్నే భవనంలో సాబ్జీ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. సభకు జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ సాబ్జీ ఉద్యోగులు, కార్మికులు, పేదల పక్షపాతి అని కొనియాడారు. పేదలు, ప్రజాసంఘాలు మహోన్నత వ్యక్తి అని అన్నారు. సాబ్జీకి నివాళులర్పించి వారి కుటుం బానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సిహెచ్. రాజ్యలక్ష్మి, జె.హరీషాదుర్గ, వెంకటలక్ష్మి, కనకదుర్గ, ఉష, లక్ష్మి, సైదాని, లోకేశ్వరి, గీత, లక్ష్మి, దుర్గ, కుమారి, భవాని దుర్గ పాల్గొన్నారు. ఐద్వా సీనియర్ నేత, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు జి.విమల సాబ్జీ మృతికి సంతాపం తెలిపారు.






నివాళులర్పిస్తున్న మాజీ ఎంఎల్‌సి వి.బాలసుబ్రహ్మణ్యం, రోదిస్తున్న మహిళలు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు



నివాళులర్పిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు



నివాళులర్పిస్తున్న ఉద్యోగ నేత విద్యాసాగర్



సాబ్జీ అంతిమయాత్రలో నేతలు



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీమంత్రి జవహర్

సాబ్జీ అంతిమప్రయాణమూ పాలకొల్లు వస్తుండగా..

ప్రజాశక్తి - పాలకొల్లు

వివిధ ఉద్యమాల సందర్భంగా పాలకొల్లు తన స్వస్థలం వంటిదని ఎంఎల్‌సి సాబ్జీ తరచూ అంటూ ఉండేవారు. ప్రమాదం జరిగిన రోజు పాలకొల్లు వస్తుండగానే అదే తన చివరి మజిలీ అని ఆయన గమనించలేకపోయారు. జన్మభూమితో ఉన్న విధంగా అనుబంధం ఉన్న పాలకొల్లు వస్తూనే ఆయన శాశ్వతంగా దూరమయ్యారు. ఉపాధ్యాయ ఉద్యమానికి బలమైన ప్రాంతం పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, పాలకొల్లురూరల్, పాలకొల్లు టౌన్ కమిటీలు కావడంతో ఇక్కడ జరిగే పెద్ద కార్యక్రమాల్లో ఆయన తప్పక పాల్గొనేవారు. ప్రతి యుటిఎఫ్ కార్యకర్తనే కాకుండా ఇతర సంఘాల నేతలు, ఉపాధ్యాయులను సైతం పేరు పెట్టి చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించడం, అవసరాలను గుర్తించి అండగా నిలవడంలో సాబ్జీ ముందుండేవారని పేరొందారు. కార్యకర్తల కోసం ఎంతవరకైనా తెగించి పోరాడటం ఆయన నైజం. అదే ఆయనకు వేలాదిమంది



అక్టోబర్ చివరి వారంలో పాలకొల్లులో యుటిఎఫ్ దీక్షల్లో పాల్గొన్న సాబ్జీ

కార్యకర్తలతో కూడిన సొంత కుటుంబమైంది. ఎంఎల్‌సి అయిన తర్వాత రెట్టించిన ఉత్సాహంతో ఈ ప్రాంతానికి వచ్చి పాఠశాలలకు వెళ్లడంతోపాటు కార్యకర్తల కుటుంబాల కార్యక్రమాలకు కచ్చితంగా హాజరయ్యేవారు. తన ఉద్యమ గురువు ఎస్ఆర్ పోలిశెట్టి ఈ ప్రాంతంవారు కావడంతో పాలకొల్లు ప్రాంతంపై తనకు ప్రత్యేక అభిమానమని చెప్పేవారు. పాలకొల్లులో ప్రాంతీయ కార్యాలయాన్ని నిర్మించాలనేది బలమైన ఆకాంక్ష. చివరకు మే ఒకటో తేదీన పాలకొల్లు యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం అమరజీవి ఎస్ఆర్.పోలిశెట్టి టీచర్స్ హోమ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన ఆయన చేతుల మీదుగానే జరిపించారు. పాలకొల్లు ప్రాంతం వచ్చినప్పుడల్లా సీనియర్ కార్యకర్తలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల, ప్రజాసంఘాల బాధ్యులను పలకరించడం, వారి బాగోగులు ఆరా తీయడంలో సాబ్జీ ముందుండేవారు. 32 సంవత్సరాల ఉపాధ్యాయ ఉద్యమం, 33 నెలల ఎంఎల్‌సి ప్రస్థానం నిరంతరం ఉపాధ్యాయుల, ఉద్యోగుల, సామాన్యుల ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారు.

మొదటిపేజీ నుంచి

కడసారి.. కన్నీటి వీడ్కోలు..!

ఏలూరులోని యుటిఎఫ్ కార్యాలయానికి తరలించారు. అక్కడ పలువురు నేతలు నివాళులర్పించారు. అనంతరం ప్రజల సందర్శనార్థం ఇండోర్ స్టేడియంకు తరలించారు. ఐ సెల్యూట్.. వుయ్ సెల్యూట్.. రెడ్ సెల్యూట్.. కామ్రేడ్ సాబ్జీకి అంటూ నినాదాలు మార్మోగాయి. సాధిద్దాం.. సాధిద్దాం.. సాబ్జీ ఆశయాలను అంటూ అక్కడికి వచ్చిన వారంతా చేసిన నినాదాలతో ఇండోర్ స్టేడియం దద్దరిల్లింది. భార్య సుభాని, కుమారుడు ఆజాద్, కుమార్తె ఆస్రిఫ్ విలపిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. సాబ్జీ భౌతికకాయాన్ని సందర్శించిన మహిళలు కన్నీరుమున్నీరుగా విలపించారు. 'మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయావా' అంటూ వచ్చినవారంతా తీవ్ర వేదనకు లోనయ్యారు. ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు ఉదయం నుంచి అంత్యక్రియలు పూర్తయ్యేవరకూ వెంటే ఉన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ఎంఎల్‌సి సాబ్జీ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ, తహశీల్దార్ బి.సోమశేఖర్, త్రీటౌన్ సిఐ వెంకటేశ్వరరావు దగ్గరుండి అన్ని ఏర్పాట్లనూ పర్యవేక్షించారు. సాబ్జీ ఇంటిదగ్గర భౌతికకాయానికి పోలీసులు గౌరవవందనం చేశారు. పడమర వీధిలోని ముస్లిం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించగా పోలీసులు గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపి, గౌరవవందనం సమర్పించారు.

తరలొచ్చిన నేతలు

సాబ్జీ అంత్యక్రియలకు సిపిఎం, ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు, జిల్లా నేతలు తరలొచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సాబ్జీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాలకు సాబ్జీ మృతి తీరని లోటు అన్నారు. సాబ్జీ శాసనమండలిలో ప్రజా సమస్యలపై నిలదీసేవారని గుర్తు చేశారు. చిన్న వయస్సులో ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారన్నారు. సాబ్జీ కుటుంబానికి సానుభూతి తెలిపారు. సాబ్జీకి నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, తెల్లం రామకృష్ణ, ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, ఎం.నాగమణి, జి.రాజు పాల్గొన్నారు. సాబ్జీ మృతి చెందిన రోజు నుంచి అంత్యక్రియలు పూర్తయ్యేవరకూ సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి దగ్గరుండి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సిఐటియు నేతల నివాళులు

రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ భౌతికకాయానికి సిఐటియు రాష్ట్ర నాయకత్వం ఘన నివాళులు అర్పించింది. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆయన భౌతికకాయానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు, డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి, కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, నేతలు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ సాబ్జీ చివరిక్షణం వరకూ కార్మిక హక్కుల కోసం పోరాడారన్నారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద సాబ్జీ భౌతికకాయంపై పూలుచల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథం, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల చివరి తేదీ వరకూ ఓటర్ల నమోదు

వివరాలను క్రోడీకరించి విజయవాడ సమీక్షా సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిమిత్తం ముందస్తుగా ఆదివారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, తహశీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అక్టోబరు 28 నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఫారం-6, 7, 8 ద్వారా లక్షా 26,681 దరఖాస్తులురాగా ఇంతవరకు 99,826 పరిష్కరించామని, మరో 26,836 పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. వీటిలో ఫారం-6 కింద 9,072, ఫారం-7 కింద 13,332, ఫారం-8 కింద 4,432 పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిని ఈ నెల 18వ తేదీలోపు పరిష్కరించాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు పూర్తికాని 17 సంవత్సరాలు నిండిన ప్రొస్పెక్టు ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వాటిని పరిశీలించాక వారి వయస్సు జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరు నెలల్లో ఎప్పుడైతే 18 సంవత్సరాలు నిండుతాయో వారిని ఓటరుగా నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే వరకు ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ, ఇఆర్‌ఒలు ఆదర్శ రాజేంద్రన్, ఎ.అద్దయ్య, కె.సుబ్బారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సత్యనారాయణ, బాబ్జి, గీతాంజలి, ఆయా నియోజకవర్గాల ఎఇఆర్‌ఒలు పాల్గొన్నారు.

పాలకొల్లులో మసకబారిన మూడో కన్ను

సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆసక్తి లేని మున్సిపాలిటీ



ప్రజాశక్తి - పాలకొల్లు

రోజురోజుకు సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. దొంగలు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగతనాలు చేస్తున్నారు. పాలకొల్లులో మాత్రం పోలీసులు ఆధునిక సాంకేతిక వాడకంలో వెనుకంజలో ఉన్నారు. పట్టణంలో 2015 పుష్కరాల సమయంలో 13 సీసీ కెమెరాలు అమర్చారు. దీనికి కంట్రోల్ పాయింట్‌గా హౌసింగ్ బోర్డులో మున్సిపాలిటీ షెడ్ నిర్మించింది. తరువాత ఒక్కొక్క కెమెరా మసకబారింది. దీంతో రెండేళ్ల క్రితం పోలీసులు ఛాంబర్ సహాయం కోరగా రూ.10 లక్షలు అన్ని సంఘాల నుంచి సేకరించారు. సీసీ కెమెరాలను కేబుల్స్‌తో కలపడానికి రూ.7 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పుడు రూ.3 లక్షలు పోలీసుల వద్ద ఉండగా మరో రూ.3 లక్షల కోసం దాతలు సహాయం అడుగుతున్నారు. అసలు మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో కనీసం 31 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఐదేళ్ల క్రితం మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేశారు. కౌన్సిల్ లేకపోవడంతో పట్టణంలో సీసీ కెమెరాలు పెట్టాలనే ఆలోచన అధికార పార్టీ నేతలకు రాకపోవడం శోచనీయం. పట్టణంలో ప్రతి పెద్ద షాపు వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు కోరుతున్నా ఫలితం ఉండటంలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సీసీ కెమెరాలు అనుసంధానం చేసి గతంలో అమరావతితో కంట్రోల్ పాయింట్ ఉండేది. అయితే వారికి సొమ్ము చెల్లించక ఈ పథకం నీరు గారింది.

మున్సిపాలిటీ కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

ముత్యాల మీనా, పాలకొల్లు



పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. కనీసం రద్దీ కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మున్సిపాలిటీ చొరవ చూపాలి.

సీసీ కెమెరాల సంఖ్య పెంచండి

బి.శ్యామల, ఐద్వా నాయకురాలు, పాలకొల్లు



పట్టణంలో నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా పోలీసు సిబ్బంది సంఖ్య తగ్గుతోంది. కనీసం సీసీ కెమెరాలు సంఖ్య అయిన పోలీసులు పెంచాలి.

సొంత ఖర్చులతో మురుగు కాల్వ పనులు

అధికారులు సహకరించాలి

గరగపర్రు రైతుల ఆవేదన

ప్రజాశక్తి - పాలకోడేరు

తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు వర్షాలు కురవడంతో ఎక్కడికక్కడ సార్వా వరి పంట పాడవటమే కాకుండా నారు మడులు కూడా దెబ్బతిన్నాయి. వర్షాలు కురిసి పది రోజులవుతున్నా ఇంకా నారుమడులు, వరి చేలు ముంపులోనే ఉండటంతో రైతులు పడరాన్ని పాట్లు పడుతున్నారు. నారుమడులు నీట మునిగి పాడవుతుండడంతో నీరు బయటికి వెళ్లే మార్గాలను రైతులే అన్వేషిస్తున్నారు. గరగపర్రు మురుగుకాలువ నాలుగు గ్రామాల మురుగు నీటిని బయటకు తీసుకెళ్తుంది. ఈ మురుగు కాలువపై గరగపర్రు, యండగండి, చిలుకూరు, ఉప్పులూరు ప్రాంతాల వరిచేలు ఆధారపడి ఉన్నాయి. ఇంత కీలకమైన ఈ మురుగు కాలువలో తూడు దట్టంగా అల్లుకోవడంతో వరి చేల్లో నీరు కాలువలోకి వెళ్లక ఇంకా చేలల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచి ఉంది. ఈ నీటిని బయటకు పంపేందుకు గరగపర్రు గ్రామంలోని రైతులు పొక్లెయిన్‌ను ఏర్పాటు చేసి రెండు రోజులుగా మురుగు కాలవలో తూడు తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న ఈ పనిని తాము అతి కష్టం మీద నిర్వహిస్తున్నామని, అధికారులు స్పందించి తమకు అండగా నిలబడాలని రైతులు కోరుతున్నారు. గరగపర్రు గ్రామానికి చెందిన రైతులు చింతలపాటి వెంకట సుబ్బరాజు, నంబూరు ఏడుకొండలరాజు, పచ్చమట్ల వెంకటరాజు, మేకల చంద్రరావు, తదితర రైతులు సమిష్టి సహకారంతో ఈ తూడు తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు.



మురుగు కాలువలో తూడు తొలగింపు పనులు


23న కల్లు గీత కార్మిక సంఘం జిల్లా మహాసభ

తణుకు రూరల్ : ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా మహాసభ ఈ నెల 23వ తేదీన భీమవరం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి తెలిపారు. స్థానిక అమరవీరుల భవనంలో కల్లుగీత కార్మిక సంఘం తణుకు డివిజన్ సమావేశం గుబ్బల నాగభూషణం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాటాడుతూ సిఎం జగన్ పాదయాత్ర సమయంలో గీత కార్మికులకు అనేక వాగ్దానాలు చేశారన్నారు. అధికారంలోకొచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. గీత వృత్తిని రక్షించడానికి గీత కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదన్నారు. కల్లును శీతల పానీయంగా అమ్ముకోవడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని మునిస్వామి అన్నారు. కరోనా సమయంలో వృత్తి లేక కార్మికులు పస్తులతో కాలం గడిపారన్నారు. ఆర్థిక సహకారం చేసిన గీత కార్మికులకు ఒక్క రూపాయి కూడా ఈ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఈ ప్రభుత్వ విధానాలు గీత కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాల గురించి ఈ మహాసభలో చర్చిస్తామన్నారు. వైసిపి గీత కార్మికులకు చేసిన అన్యాయంపై రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం గీత కార్మికులు చెప్తారన్నారు. గత మహాసభ నుంచి ఈ మహాసభ వరకు గీత కార్మికులు చేసిన పోరాటాల ఫలితాలపై చర్చిస్తామన్నారు. రానున్న కాలంలో గీత కార్మికుల జీవన విధానం మెరుగ్గా ఉండేలా గీత కార్మిక సంఘం పని చేసేందుకు కర్తవ్యాలను రూపొందిస్తామని మునిస్వామి తెలిపారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి కాసాని శ్రీనివాసు, తంటా ముత్యాలు పాల్గొన్నారు.

జార్జి బెనహర్‌కు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన జార్జి బెనహర్ వైసిపి క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర విభాగ కమిటీ అధికార ప్రతినిధిగా నియామకం పట్ల కాళ్ల మండల క్రిస్టియన్ మైనారిటీ పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జార్జి బెనహర్ కాళ్ల మండల కో-ఆప్షన్ సభ్యులుగా పని చేస్తున్నారు. ఆదివారం జువ్వలపాలెంలో సిబిసిఎన్‌సి స్టార్ ఆఫ్ హోప్ బాప్టిస్ట్ సంఘం బెనహర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను అధికార ప్రతినిధిగా నియమించిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిబిసిఎన్‌సి స్టార్ ఆఫ్ హోప్ బాప్టిస్ట్ చర్చి సంఘ సిఆర్, సంఘ ట్రెజరరీ, సంఘ పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బెనహర్‌ను సత్కరిస్తున్న వక్తలు

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి



బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు :మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకలు, ప్రకృతి ప్రేమికులు ఉదయమే బీచ్‌కు చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున్న ఉన్న ఆలయాలను దర్శించుకుని కొబ్బరితోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

ఘనంగా షష్ఠి ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, నత్తా రామేశ్వరం, జుత్తిగ, మార్టేరు, ఆలమూరు, భట్లమాగుటూరు, ఓడూ రు, నెలమూరు, మాముడూరుతో పాటు పలు గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు.

తాడేపల్లిగూడెం:సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు సోమవారం తెల్లవారుజాము మూడు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు శివాలయం రోడ్డు, చిన వంతెన, ఫ్లైఓవర్ బ్రిడ్జి కింది వరకు ఉన్న రోడ్డులో, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ప్రాణ హాని జరగకుండా సదరు రోడ్డులో వాహనాలకు ప్రవేశం నిలిపివేసినట్లు పట్టణ పోలీసు అధికారులు తెలిపారు. ప్రజలు వారి అవసరాల నిమిత్తం ప్రత్యామ్నాయ రోడ్లను వాడుకుని, పోలీసువారికి సహకరించాలని సిఐ నాగరాజు తెలిపారు.



బహుమతులు అందిస్తున్న సత్యనారాయణమూర్తి

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఆర్‌టిసి బస్సుల్లో సురక్షిత ప్రయాణంతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ప్రతి 15 రోజులకు అందిస్తోందని డిపో మేనేజర్ వై.సూర్యనారాయణమూర్తి తెలిపారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రయాణించిన వారి టికెట్లు ఆదివారం తాడేపల్లిగూడెం బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సమక్షంలో లక్కీ డిప్ నిర్వహించారు. ఈ లక్కీడిప్‌లో విజేతలకు తాడేపల్లిగూడెం జివి మాల్ వారి సౌజన్యంతో బహుమతులను అందించినట్లు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ మూర్తి తెలిపారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమిదే విజయం'

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ప్రజలు టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి ఎప్పుడు వస్తుందా అని ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో పాలకొల్లు నియోజకవర్గంలో టిడిపి, జనసేన కూటమి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం వంద శాతం పూర్తి చేసిన బూత్ కమిటీ కన్వీనర్లను ఆదివారం అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలన ఎప్పుడు పోతుంతా తమ కష్టాలు ఎప్పుడూ తీరతాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తుంటే ప్రజలు, మహిళలు, పేదల నుంచి స్పందన కనిపిస్తుందన్నారు. నియోజకవర్గం మొత్తం మీద 69 వేల ఇళ్లు ఉండగా ఇప్పటివరకు 39,217 ఇళ్లకు బాండ్ల పంపిణీ జరిగిందన్నారు. 190 బూత్‌లకు తొలి విడతగా 14, ప్రస్తుతం 22 కలిపి మొత్తంగా 36 బూత్‌ల్లో నూటికి నూరు శాతం పూర్తయిందన్నారు. బూత్ కన్వీనర్లతోపాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎంఎల్‌ఎ కృతజ్ఞతలు తెలిపారు. ఆరిమిల్లి శ్రీనివాస్, చిట్టూరి సీత రామాంజనేయులు, మల్లంపల్లి పకీర్‌బాబు, పాలపర్తి మాధవరావు, అశోక్ ధర్మవరపు, చింత సత్తిబాబు, శ్రీనివాస్ నారిన, రామకష్ణ గుంటూరు, వివి.సత్యనారాయణమూర్తి, తానంకి వెంకట కృష్ణారావు, మోక్ష గణపతి, చల్లా నరేంద్రలను సత్కరించారు.

పాలకొల్లులో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పాలకొల్లు ఆర్‌ఆర్ రైస్ మిల్ ఆవరణలో ఆదివారం సత్యదేవుని హోమం, అన్నవరం నుంచి తెచ్చిన ఉత్సవ విగ్రహాలతో సత్యదేవుని వ్రతం ఘనంగా నిర్వహించారు. టిటిడి సభ్యులు మేకా శేషుబాబు సారధ్యంలో విగ్రహాలను రప్పించారు. అన్నవరం పురోహితులు వ్రతంను నిర్వహించి అన్నవరం ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాల భజన కాలక్షేపం, ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎంఎల్‌సి మృతి కేసుపై క్షేత్రస్థాయి విచారణ

ఆకివీడు సిఐ సత్యనారాయణ

ప్రజాశక్తి - ఉండి

రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని ఆయన కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నామని ఆకివీడు సిఐ కెవివిఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను, అతని అనుచరులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు రోజుల నుంచి విచారించామని, పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో ఇది అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదమేనని తేలిందన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో రహదారి పూర్తిగా దెబ్బ తినడం వల్ల అధిక వేగంతో వస్తున్న కారు అదుపుతప్పి ఎంఎల్‌సి కారును ఢీకొట్టిందని తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని చెప్పారు.



మంత్రిని అభినందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

రాజకీయాలు, అభివృద్ధి కలిపి చూడకూడదు

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ప్రాంత అభివృద్ధి గురించి ఆలోచించాలని, అభివృద్ధి చేసేవారిని ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. రాజకీయాన్ని, అభివృద్ధిని కలిపి చూడకూడదన్నారు. రాజకీయ వైరుధ్యంతో అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం ఆ ప్రాంతానికి అన్యాయం చేయడమేనన్నారు. తాడేపల్లిగూడేనికి అదనపు జిల్లా కోర్టు తీసుకురావడం పట్ల బార్ అసోసియేషన్ తరపున పలువురు న్యాయవాదులు మంత్రి కొట్టును ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధికి ప్రతిపక్షాలు సహకరించకపోగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. అదనపు జిల్లా కోర్టు తీసుకురావడం వెనుక ఎంతో శ్రమ ఉందన్నారు. తాడేపల్లిగూడేనికి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం, అదనపు జిల్లా కోర్టు సాధించి తీసుకు రాగలిగానన్నారు. త్వరలోనే ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాలు కూడా తాడేపల్లిగూడెంలో ఏర్పాటు కాబోతున్నాయని చెప్పారు. దశాబ్దాల తరబడి పట్టణ శివారు ప్రాంతాల్లో పరిష్కారం కాని తాగునీటి సరఫరా సమస్యను తాను పరిష్కరిస్తున్నానని చెప్పారు. మండలంలోని జువ్వలపాలెం, తాళ్లముదునూరుపాడు, వీకర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు వంటి శివారు ప్రాంతాలకు ఇక ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాల్సిన అవసరం లేకుండా కొత్త పైపులైన్లు వేస్తున్నామన్నారు. మిలటరీ కాలనీ, గణేష్ నగర్ వంటి ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసేలా ఎపి నిట్‌కు ఎదురుగా వెయ్యి కిలో లీటర్ల కెపాసిటీతో కొత్త రిజర్వాయర్ నిర్మిస్తున్నామన్నారు. అదనపు జిల్లా కోర్టును తీసుకొచ్చినందుకు మంత్రి కొట్టును తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొవ్వూరి అప్పిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మాకా శ్రీనివాస్, బండారు మనోహర్, అద్దంకి విజయరత్నం, రామగాని సోమేశ్వరరావు, బాయిశెట్టి ప్రసాద్, మానుకొండ గోపాలరావు, యడవల్లి మణికంఠ తేజ అభినందించారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిపిఎస్‌ను, జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు జి.ప్రకాశం, జిల్లా ప్రధాన కార్యదర్శి బివి.నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పిఎఫ్ లోన్లు, సరెండర్ లీవులు, ఎపిజిఎల్ఐ ఫైనల్ పేమెంట్లు ఈ పండుగ రోజుల్లో అయినా చెల్లించాలని కోరారు. జులై ఒకటో తేదీ నుంచి ఆర్ఐ (మధ్యంతర భృతి) చెల్లించాలని కోరారు.

ఉద్యమం మరింత ఉధృతం

ఆరో రోజుకు అంగన్‌వాడీల సమ్మె

పలుచోట్ల పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతల మద్దతు

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదని స్పష్టం



వీరవాసరంలో...



ముసునూరులో...

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు పిల్లల తల్లుల ఇంటికి వెళ్లి తమ సమస్యలను వివరించి, కరపత్రాలు పంచి మద్దతు తెలపాలని కోరారు. పలుచోట్ల పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలు సమ్మె శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. పలు చోట్ల నోట్లో గడ్డి పెట్టుకుని, మోకాళ్లపై నడస్తూ నిరసన తెలిపారు. మొగల్తూరులో అంగన్‌వాడీ కేంద్రం తాళలు పగలకొట్టేందుకు వచ్చిన అధికారులు స్థానికులు, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు చెప్పారు.



ముదినేపల్లిలో..

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్దకు లబ్ధిదారులు, ప్రీస్కూల్ పిల్లలు, పిల్లల తల్లులు వచ్చి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు వెంకట లక్ష్మి, శ్రావణి, కుమారి, వెంకాయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



చింతలపూడిలో...

కలిదిండి : మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శిబిరం వద్దకు గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లల తల్లులు వచ్చి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు.

ఉంగుటూరు : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారంతో ఆరో రోజుకు చేరింది. జాతీయ రహదారి ఉంగుటూరు వద్ద సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొంటున్నారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. తమ న్యాయమైన కోర్కెలు సాధించేంతవరకు సమ్మె విరమించేది



ఉంగుటూరులో...

లేదని అంగన్‌వాడీ నాయకులు సుజాత, మల్లేశ్వరి చెప్పారు. ఈ నెల 18వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన ప్రదర్శన చేయనున్నామని తెలిపారు.

చింతలపూడి : పట్టణంలో ఫైర్‌స్టేషన్ వద్ద సమ్మెలో సిఐటియు అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ టి.మాణిక్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, ప్రాజెక్ట్ అధ్యక్షులు సరోజిని, సరళ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలో సమ్మె శిబిరం వద్ద ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్తేరు, నాగమణి, జ్యోత్స్న, పూర్ణవతి, సరళ పాల్గొన్నారు.



పోలవరంలో...

టి.నరసాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ సమ్మెలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు బి.ఫణివర్ధిని, ఎన్.మార్తమ్మ, ఎం.సత్యవతి, కె.బాబి, జి.రామదుర్గ, బి.అచ్చులమ్మ పాల్గొన్నారు.

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీలు మోకాళ్లపై నడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డివిజన్ ప్రాజెక్ట్ కార్యదర్శి పల్లి పాము రాజకుమారి, విద్యావతి, లక్ష్మి, సులోచన, శిరీష దుర్గ పాల్గొన్నారు.



ఆకివీడులో...

మండవల్లి : స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా ఆరో రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లు చెల్లమ్మ విజయలక్ష్మి, ఉమాదేవి, మల్లేశ్వరి, కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండల కేంద్రంలోని ముదినేపల్లిలో సమ్మెలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు



పోదూరులో...

మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలవరం : మండల కేంద్రమైన పోలవరంలో అంగన్‌వాడీలు నోట్లో గడ్డిని పెట్టుకుని నిరసన తెలిపారు. సిఐటియు కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరంలో అంగన్‌వాడీలకు మద్దతుగా లబ్ధిదారులు వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంతసేపు మానవహారం చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆకివీడు : ఆకివీడులో అంగన్‌వాడీలకు మద్దతుగా ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ మాట్లాడారు. స్థానిక నంద్యాల సుబ్బారావు భవనం ఐఎఫ్‌టియు కార్యాలయంలో మండల కన్వీనర్ తోట రామకృష్ణ అధ్యక్షతన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సమైక్య కార్యాలయం నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు రమేష్, హనుమంతు, కాశి, అడపాల కృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

గణపవరం : మండలంలోని 25 గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి తమ కోర్కెల కరపత్రాన్ని లబ్ధిదారులకు అందించారు. అంగన్వాడీలకు మద్దతుగా ప్రతి గ్రామంలోనూ ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాటుక ఝాన్సీలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఎండి హసినాబేగం, అంగన్‌వాడీ మండల నాయకులు బి.రామకోటి, కెవి.మహాలక్ష్మి, ఎ.కల్యాణి, వికె.జయలక్ష్మి, ద.ొనలక్ష్మి పాల్గొన్నారు.

పోదూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. పెనుమదంలో జరిగిన ర్యాలీలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణితో పాటు జి.వనజ, టి.విస్తోరి, అమ్మాజీ, కె.అరుణ, పద్మావతి, కె.ప్రభావతి, పి.ప్రసన్న పాల్గొన్నారు.



గణపవరంలో...

ఉండి : అంగన్వాడీలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును సమస్యలను వివరించారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు లబ్ధిదారులు, అంగన్వాడీలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు మద్దతు కోరారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సానుకూలంగా స్పందించి అంగన్వాడీలు లేని పాఠశాలలకు తమ చిన్నారులను పంపించేది లేదని అంగన్వాడీలు ఉంటేనే తమ చిన్నారులకు రక్షణ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన కోరికలను తీర్చాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

యలమంచిలి : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చిన్నారుల తల్లిదండ్రులకు తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రజని, పద్మశ్రీ, దేవి పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో..